క్లుప్తంగా

పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన



వాకలపూడిలో పార్కు నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి వైద్యనగర్‌లో గ్రామ పంచాయతీ సామాజిక స్థలంలో నూతనంగా పార్కు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఇటీవల స్థానిక మహిళలు ఎమ్మెల్యేను కలిసి తమ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు నెల తిరగకుండానే గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో పార్కు ఏర్పాటు పనులకు రంగం చేశారు. పార్కు కోసం విన్నవించిన మహిళల సమక్షంలోనే ఎమ్మెల్యే కన్నబాబు భూమి పూజ చేయడంతో పాటు వారితోనే కొబ్బరికాయలు కొట్టించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, గొల్లపల్లి జగన్, కాశీ, నల్ల రాణి, శ్రీను, నమ్మి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన

కరప: మండల కేంద్రం కరపలో శుక్రవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు అసైన్‌మెంట్ భూములకు సంబంధించి భూ బదలాయింపు హక్కులు కల్పిస్తూ ధృవీకరణ పత్రాలను ఎమ్మెల్యే కన్నబాబు లబ్ధిదారులకు అందజేస్తారని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమై గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు.

సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వర స్వామివారి ఆలయ అధికారుల ఆధ్వర్యంలో సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. దీనిలో భాగంగా పిఠాపురం మండలం విరవ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో వారం రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సనాతన ధర్మం విలువను ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు పలువురు భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. కార్తిక ఏకాదశి కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి, కుమారస్వామికి, బాలాత్రిపుర సుందరి దేవికి పూజలు చేశారు. తెల్లవారు జాము, రాత్రి ఆలయంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. రావి, ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. కార్తిక మాసం శివాలయాలలో దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని భక్తులు నమ్మకం. ఈ మేరకు పంచారామ క్షేత్రంలో ప్రతి రోజు కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఆలయంలో పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు దంపతులు లక్ష పత్రి పూజలు చేశారు. వారి కోసం ప్రత్యేకంగా దీపారాధన సంఘ భక్తులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. దానిలో దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు. లక్షపత్రి పూజలు చేసుకున్న వారు దీపాలు వెలిగించిన తరువాత మిగిలిన దీపాలను భక్తులు వెలిగించారు.

ప్రజల ఆరోగ్యం సురక్షితం



జగనన్న ఆరోగ్య శిబిరంలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యులు



శిబిరంలో వైద్య సేవల కోసం నమోదు చేసుకుంటున్న రోగులు

- విజయవంతమైన వైద్య శిబిరాలు
- సద్వినియోగం చేసుకున్న ప్రజలు
- రూరల్‌లో 1,58,371 మందికి వైద్య సర్వే

కాకినాడ రూరల్: విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ సంక్షేమ ప్రభుత్వం సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష నియోజవర్గంలో విజయవంతమైంది. ఇంటింటికీ వచ్చి అనారోగ్య సమస్యలు తెలుసుకుని శిబిరాల్లో వైద్య సేవలు అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చివరిగా సర్పవరంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంతో ఇక్కడి షెడ్యూల్ ముగిసింది. నియోజకవర్గంలో సెప్టెంబరు 30న పి.వెంకటాపురంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత ఈ శిబిరాలను ప్రారంభించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని మొత్తం 62 సచివాలయాలకు గాను పీహెచ్‌లు ఉన్న సచివాలయాలు మినహా 58 సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించారు. రూరల్ మండలంలో 1,65,000 జనాభా ఉండగా 62,123 ఇళ్లు ఉన్నాయి. 41 గ్రామ సచివాయలకు పండూరు, తూరంగి గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండడంతో వాటి పరిధిలో సచివాలయాలు మినహాయించి మిగిలిన 39 సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందు కోసం గ్రామాలలో 1,58,371మందిని సర్వే చేశారు. ఆయా శిబిరాలలో మొత్తం 16,419 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 38 మందిని ఆరోగ్యశ్రీ సేవలకు రిఫర్ చేశారు. కరప మండలంతో పాటు కాకినాడ అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గ 8 డివిజన్లలో 17 సచివాయాలలో వారు ఈ శిబిరాలు ద్వారా సేవలందుకున్నారు. వైద్య శిబిరాలు విజయవంతమయ్యేలా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, అధికారులు, వైద్యులు నిరంతరం పర్యవేక్షించారు.

మా దగ్గరకు వచ్చి వైద్యం అందించారు



జగనన్న ఆరోగ్య సురక్ష మంచి కార్యక్రమం. ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి కూపన్ అందించారు. సచివాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో వైద్యం పొందాను. నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. మందులు ఇచ్చారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు.

– నెక్కంటి రామలక్ష్మి, కొత్తూరు, రాయుడుపాలెం, రమణయ్యపేట పంచాయతీ

ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు



వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాం. సర్వేలో గుర్తించిన వారితో పాటు అదనంగా చాలా మంది హాజరయ్యారు. స్పెషలిస్టు వైద్యులు సేవలందించారు. పేషెంట్లకు ఉచితంగా మందులతో పాటు కేస్ షీట్‌లను అందించాం.

– కె.మాధవి, వైద్యాధికారి, పండూరు పీహెచ్‌సీ



వేదిక వద్ద లలితా కుంకుమార్చన చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మహాశక్తి యాగం

- కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు
- బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బగళాముఖి అమ్మవారిని దర్శించుకుంటున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీ పీఠంలో పరిపూర్ణానంద స్వామి పర్యవేక్షణలో చేపట్టిన మహాశక్తి యాగం గురువారం పదో రోజుకు చేరుకుంది. శత కోటి లలితా కుంకుమార్చనలతో యాగం విజయవంతంగా జరుగుతుంది. గురువారం ఉదయం నక్షత్ర పూజ, తిథి పూజల అనంతరం మహాశక్తి యాగం వేదికలో కుంకుమార్చనలు నిర్వహించారు. పరిపూర్ణానంద స్వామి, ఆధ్యాత్మిక వేత్త నండూరు శ్రీనివాస్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కుంకుమార్చనల అనంతరం భక్తులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదికపై సంగీత అకాడమీ విజయశ్రీ, శిష్య బృందం సంగీత కచేరీ నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వరులు ఊరేగింపు అనంతరం స్వామీజీ స్వామి అనుగ్రహ భాషణంతో దీపోత్సవాలు నిర్వహించారు. రాత్రి బగళాముఖి హోమం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

28న మధ్వ కార్తిక సమారాధన

బోట్‌క్లబ్: మధ్వపురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో ఈ నెల 28న కార్తిక వన సమారాధన స్థానిక గొడారిగుంటలోని రమా సహిత సత్యదేవ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు పరశురామ్ గురవారం తెలిపారు. కార్తిక సమారాధనలో ఉదయం 6 గంటలు నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉద యం 11 గంటలకు పూర్ణాహుతి, అనంతరం కార్తీకమాస విశేషాలను ప్రవచన రూపంలో చెప్పడం జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

అర్హులందరికీ పథకాలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- అదే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

కాకినాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడైనా అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. స్థానిక 16వ డివిజన్ గోగుదానయ్యపేట ప్రాంతంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు స్థానికులు పథకాలు అందకపోతే వివరాలను తెలియజేయాలని సూచించారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇంటింట సర్వే చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ల జోగారావు, పేర్ల రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించండి

కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 రూపకల్పనలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను గడువులోపు పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్–2024 కార్యకలాపాలపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, నియోజకవర్గం హెడ్ క్వార్టర్ తహసీల్దార్లతో కలెక్టర్ కృతికా శుక్లా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎం స్టోరేజ్ పాయింట్ల గుర్తింపు, డెమోగ్రాఫికల్ సిమిలరీ ఎంట్రీస్, ఫారం 6, 7, 8ల పరిష్కారం డోర్ నంబర్, క్లెయిముల పరిష్కారాలు, 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చడం వంటి అంశాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనలో భాగంగా అధికారులు ఎన్నికల అంశాలకు ప్రాధాన్యమిచ్చి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న దరఖాస్తులను రానున్న వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఈట్ల కిషోర్, జె.సీ తారామారావు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ నియోజకర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మహావిష్ణువు అలంకరణలో సీతారామస్వామి



మహావిష్ణువుగా దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం సీతారామ స్వామి మహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బేసిక్ ల్యాబ్‌ల ఉనికిని కాపాడండి



డీఎంహెచ్‌వోకు వినతి పత్రం సమర్పిస్తున్న డిస్ట్రిక్ట్ మెడికల్ ల్యాబొరేటరీస్ అసోసియేషన్ బృందం

- డీఎంహెచ్‌వోకు జిల్లా మెడికల్ ల్యాబొరేటరీస్ అసోసియేషన్ వినతి

కాకినాడ క్రైం: బేసిక్ మెడికల్ ల్యాబ్‌ల ఉనికిని కాపాడాలని కోరుతూ కాకినాడ డిస్ట్రిక్ట్ మెడికల్ ల్యాబొరేటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. ల్యాబ్‌ల ఆదాయాలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో పాథాలజిస్టులను నియమించి వారికి జీతాల చెల్లింపు మరింత భారమవుతుందని నివేదించారు. ల్యాబొరేటరీ ప్రమాణాలకు అనుబంధంగా విద్యార్హత పొందిన తమ నైపుణ్యాన్ని ఆమోదించిన తర్వాతే అర్హత పత్రాలు కేటాయించారని, సదరు సర్టిఫైడ్ ఎల్‌టీలకు పాథాలజిస్టుల అవసరం తప్పనిసరి కాదన్నారు. బేసిక్ ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించేందుకు వారి అవసరం లేదన్నారు. ఇదే అంశం ప్రాతిపదికన పాథాలజిస్టులు లేని ల్యాబ్‌లను మూసి వేసే యోచన చేస్తే వేలాది మంది ఎల్‌టీలు నిరుద్యోగులవుతారని వారి కుటుంబాలు ప్రభావితమవుతాయని వెంకట్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు సమాచారం కోరిన నేపథ్యంలో ప్రభుత్వం తమకు అండగా నిలవడం హర్షణీయమన్నారు. ఇదే ధోరణి కొనసాగించి బేసిక్ ల్యాబ్‌ల ఉనికిని కాపాడాలని డీఎంహెచ్‌వో సహా ఎస్‌వో విజయలక్ష్మికి విన్నవించారు. తమ నివేదనను ప్రభుత్వం ద్వారా కోర్టుకు సమర్పించాలని కోరారు. డీఎంహెచ్‌వోని కలిసిన వారిలో కార్యదర్శి ఏఎస్ నాగేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు తప్పవు

పెద్దాపురం: పట్టణంలో పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు హెచ్చరించారు. పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో గురువారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దావీదురాజు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యాపారులపై నిర్వహించిన దాడుల్లో 15 కేజీల ప్లాసిక్ సంచులను స్వాధీనం చేసుకుని సుమారు రూ.15 వేల అపరాధ రుసుము విధించినట్లు దావీదురాజు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓదూరి నాగేశ్వరరావు వీరలక్ష్మి దంపతులు కార్తికమాసాన్ని పురస్కరించుకుని గురువారం చేబ్రోలులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 600 మందికి అన్నదానం చేసి దుప్పట్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. 2011లో ఇద్దరితో ప్రారంభించిన ఆ కార్యక్రమంలో ఏటా పెంచుతూ ఇప్పుడు ఎక్కువ మందికి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదూరి కిషోర్, బుద్దాల శ్రీనివాస్, దిబ్బిడి సురేష్, అల్లం దుర్గ, మెట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



సిరిపురం సమావేశంలో మాట్లాడుతున్న మండలపార్టీ అధ్యక్షుడు ఈశ్వరరావు



సిరిపురంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

సిరిపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మద్దతు పలికి, మళ్లీ ఆశీర్వదించాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు కోరారు. మండలం సిరిపురంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 98 శాతం అమలుచేసి, చెప్పనివి కూడా అందజేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించి, తద్వారా సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న మాయల గారడీలో పడకుండా, ప్రజల కోసం పనిచేస్తున్న జగనన్నకు, కన్నబాబుకు అండగా ఉండాలన్నారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద అధికారులతో కలసి ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. నోడల్ అధికారి ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ నున్న సుజాత మాట్లాడుతూ 25 డీబీటీ, 4 నాన్ డీబీటీ, 4 ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంల ద్వారా సిరిపురంలో రూ.18.11 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపి, గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నున్న వీరబాబు, కార్యదర్శి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పరిశీలన

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పీఏఎల్ ట్యాబ్‌ను కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పీఏఎల్ ట్యాబ్‌ల ద్వారా గణితం సులభంగా నేర్చుకోగలుగుతారని ఆయన అన్నారు. ఈ ల్యాబ్‌లను ప్రతి విద్యార్థి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రతీ వారానికి 60 నిమిషాల పాటు ట్యాబ్‌ను వినియోగించుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. చేబ్రోలు ఉన్నత పాఠశాలకు 30 ట్యాబ్‌లు మంజూరయినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీఎస్ ప్రకాష్, వీరాస్వామి, మూర్తి, ఎం.పద్మజ, ఉమాదేవి పాల్గొన్నారు.

రథం షెడ్‌కు శంకుస్థాపన

సామర్లకోట: ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో గొంచాల అగ్రస్థానంలో ఉన్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రథం షెడ్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ గ్రామం నుంచి ఏటా భక్తులు కాలి నడకన భద్రాచలం వెళ్తారు. గత ఏడాది భక్తుల నుంచి వచ్చిన విరాళాలతో భద్రచలం సీతారాములను తీసుకు వెళ్లడానికి చేయించిన టేకు చెక్క రథాన్ని భద్రపరచడానికి పంచాయతీ స్థలం కేటాయించడంతో టీడీడీ నుంచి మంజూరైన నిధులతో ఈ షెడ్ నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకట్రాయుడు, గ్రామ నాయకులు చోడిశెట్టి చినజోగారావు, కర్రి బుజ్జి, అముజాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పరిశ్రమల ప్రతినిధులు
- వివిధ క్రీడాంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్న కార్మికులు



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఆయా పరిశ్రమల ప్రతినిధులు

సామర్లకోట: పరిశ్రమల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించుకొవడానికి ఆటల పోటీలు ఏర్పాటు చేసినట్లు వివిధ పరిశ్రమల యజమానులు తెలిపారు. జిల్లా పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలో ఉన్న ఉద్యోగులకు, కార్మికులకు వివిధ ఆటల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయగా గురువారం నుంచి కళాశాల ఆవరణలో నిర్వహించుకొవడానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వీరయ్య చౌదరి అనుమతించారు. నియోజకవర్గ పరిధిలో పెద్ద పరిశ్రమలైన రాక్ సిరామిక్స్, అపర్ణ సిరామిక్స్, రిలయన్స్ పవర్ ప్లాంటు, గిరిజా పవర్ ప్లాంటు, దేవి సీఫుడ్స్, నెక్కంటి ఫుడ్స్‌కు చెందిన పరిశ్రమ ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఆయా పరిశ్రమల ప్రతినిధులు పోటీలను ప్రారంభించారు. ఉద్యోగులు, కార్మికులలో ఉన్న ఒత్తిడి క్రీడల వల్ల తొలగిపోయే అవకాశం ఉంటుందన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ప్రారంభ ఆటల పోటీల్లో రాక్ సిరామిక్స్ ప్రతినిధులు టి.నీరజ్‌కుమార్, పి.బాలాజీ, వీజీఎస్ కుమార్, ఆదర్శ్, అపర్ణ నుంచి మధుసూదన్, సత్యనారాయణ, రిలయన్స్ పవర్ నుంచి ప్రకాష్, దేవి సీఫుడ్స్ నుంచి రవీంద్రనాథ్, అనిల్, గిరిజ పవర్ నుంచి రవి, నెక్కంటి సీఫుడ్స్ నుంచి గోపీచంద్, సురేంద్ర పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న కార్మికులు